www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

రామాంజనేయ కాలనీలో పోలీసుల

మెరుపు తనిఖీలు..!



3

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 293 శుక్రవారం 20-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 06 వెల : 5



ఛాంబర్ వార్

భద్రాచలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివాదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. భిన్నమైన అభిప్రాల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. వ్యాపార వర్గాల్లోనే చీలికలు ఏర్పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పారదర్శకతలేదనే వాదన ఓవైపు వ్యాపార సంఘ ఎన్నికలపై రాజకీయనేతల పెత్తనం సరికాదంటూ వాదన ఇంకోవైపు... న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాల్సిందే అంటూ బి ఆర్ఎస్ పార్టీ సూచనలు ఇంకోవైపు.... మొత్తంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు బహిరంగ విమర్శలకు వేదికగా మారాయి. అటు రాజకీయ పార్టీలు ఇటు వ్యాపార వ్యాపార వర్గాల్లో చీలికలు పత్రికా ప్రకటనలు ప్రెస్ మీట్ల పేరుతో చాంబర్ ఎన్నికల ప్రక్రియపై బహిరంగ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికలు ఉత్కంఠ భరిత స్థాయికి చేరుకుంటున్నాయి.

భద్రాద్రిలో ఎన్నికల" ఫీవర్ "

న్యాయబద్ధంగా జరపాలంటున్న బిఆర్ఎస్

పార్టీల జోక్యంతో పనిలేదు అంటున్న ఓవర్గం

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేదంటున్న మరో వర్గం

వేడి పుట్టిస్తున్న భద్రాద్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

విమర్శలు.. ప్రతి విమర్శలు.. సలహాలు.. సూచనలు

ప్రెస్ మీట్లు.. పత్రికా ప్రకటనలు

బహిర్గతమవుతున్న భేదాభిప్రాయాలు

ఎన్నికలకు ముందే నిర్వహణ తీరుపై విమర్శలు

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

'ఛాంబర్' ఎన్నికలపై ఏకపక్ష

నిర్ణయాలు చెల్లవు

రిజిస్టర్డ్ కమిటీలో అందరికీ హక్కులుంటాయి

నిబంధనలు పాటించాల్సిందే

వ్యాపార వర్గాల ఆలోచించాలి

బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్



2

పేదలు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ఇందిరమ్మ లక్ష్యం

- ఇందిరాగాంధీ ఆశయాలే కాంగ్రెస్ శ్రేణులకు స్ఫూర్తి
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ.. ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు



4

నేటి నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల ప్రారంభం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో దశల వారీగా నెల రోజుల పాటు క్యాంపుల నిర్వహణ
- రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులు, బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాల నమోదు
- ఇతర ప్రభుత్వ బీమా పథకాలు ఉన్నా ఇందిరమ్మ కుటుంబ బీమాకు అర్హత
- క్యాంపుల నిర్వహణపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



5



ఛాంబర్ వార్

భద్రాచలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివాదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. భిన్నమైన అభిప్రాల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. వ్యాపార వర్గాల్లోనే చీలికలు ఏర్పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పారదర్శకతలేదనే వాదన ఓవైపు వ్యాపార సంఘ ఎన్నికలపై రాజకీయనేతల పెత్తనం సరికాదంటూ వాదన ఇంకోవైపు... న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాల్సిందే అంటూ బి ఆర్ఎస్ పార్టీ సూచనలు ఇంకోవైపు.... మొత్తంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు బహిరంగ విమర్శలకు వేదికగా మారాయి. అటు రాజకీయ పార్టీలు ఇటు వ్యాపార వ్యాపార వర్గాల్లో చీలికలు పత్రికా ప్రకటనలు ప్రెస్ మీట్ల పేరుతో చాంబర్ ఎన్నికల ప్రక్రియపై బహిరంగ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికలు ఉత్కంఠ భరిత స్థాయికి చేరుకుంటున్నాయి.

న్యాయబద్ధంగా జరపాలంటున్న బిఆర్ఎస్

పార్టీల జోక్యంతో పనిలేదు అంటున్న ఓవర్గం

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేదంటున్న మరో వర్గం

వేడి పుట్టిస్తున్న భద్రాద్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

విమర్శలు.. ప్రతి విమర్శలు.. సలహాలు.. సూచనలు

ప్రెస్ మీట్లు.. పత్రికా ప్రకటనలు

బహిర్గతమవుతున్న భేదాభిప్రాయాలు

ఎన్నికలకు ముందే నిర్వహణ తీరుపై విమర్శలు

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

భద్రాద్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల వ్యవహారం తీవ్ర దుమారానికి దారితీస్తున్నాయి. వ్యాపార సంఘ ఎన్నికలపై రాజకీయాల జోక్యం అవసరమా అంటూ ఓవర్గానికి చెందిన వ్యాపారులు చేస్తున్న విమర్శ అనుకోకుండానే ఆ ఎన్నికల్లో రాజకీయ జోక్యానికి ఆస్కారం ఏర్పడేలా చేస్తుంది.. ఓవైపు వ్యాపారస్తులు చీలికలు ఇరువర్గాల విమర్శలు ప్రతి విమర్శలు మరో వైపు రాజకీయ పక్షాల సూచనలు సలహాలు పేరుతో సాగుతున్న ఎన్నికల తంతు క్రమం తప్పని దుమారం వైపు అడుగులు వేస్తున్నాయి.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల ప్రక్రియ న్యాయపరంగాలేదు

భద్రాచలం పట్టణంలో ఈ నెల 29న జరగనున్న శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగడం లేదని పట్టణ వ్యాపారులు బచ్చు శ్రీనివాస్, కల్కి వాసు, భరత్ ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని వారు విమర్శించారు.

భద్రాచలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సుమారు 2 వేల మంది సభ్యత్వాలు కలిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల అధికారిని కూడా అందరి అంగీకారంతో పారదర్శకంగా ఎంపిక చేయలేదని ఆరోపించారు.

ఎన్నికల నియమావళిలో లేని నిబంధనలను అభ్యర్థుల అంగీకార పత్రంలో చేర్చి, వాటిపై సంతకాలు చేస్తేనే పోటీలో కొనసాగేందుకు అవకాశం ఉంటుందని, లేనిపక్షంలో పోటీకి అనర్హులవుతారని చెప్పడం సరికాదని బచ్చు శ్రీనివాస్ పేర్కొన్నారు. తమను ఎన్నికల పోటీ నుంచి తప్పించేందుకు ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చారని అనుమానం వ్యక్తం చేశారు.

భద్రాద్రిలో ఎన్నికల" ఫీవర్ "

ఛాంబర్' ఎన్నికలపై ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు

- **రిజిస్టర్డ్ కమిటీలో అందరికీ హక్కులుంటాయి**
- **నిబంధనలు పాటించాల్సిందే**
- **వ్యాపార వర్గాల ఆలోచించాలి**
- **బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్**



భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు న్యాయబద్ధంగా జరపాలని, ఏకపక్ష నిర్ణయాలు సబబు కాదని , వ్యాపార వర్గాలు కలిసి ఉండాలని బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జ్ రావులపల్లి రాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు

ఎంతో ప్రతిష్టాత్మకమైన భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల నిర్వహణలో గత పదేళ్లుగా సందిగ్ధత నెలకొనడం ఎంతవరకు సమంజసం అన్నారు. 2005లో కమిటీ ఏర్పడినప్పటికీ వ్యాపార వర్గాల్లో ఐక్యత లేదన్నారు

ఇటీవల ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు పూనుకున్నప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలు ఒక వర్గానికి కొమ్ము కాస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా ఉంటున్నాయని 'రావులపల్లి" అభిప్రాయం వ్యక్తం చేశారు

నామినేషన్ ప్రక్రియ జరిగి, స్క్రూట్ నీ ముగిసి, గుర్తులు కేటాయించే సమయంలో కొందరిని ఎన్నికల పోటీ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ఇన్నేళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నో సంస్థల ఎన్నికలు చూసామని, ఇటువంటి చిత్రమైన నిర్ణయాలు ఎన్నడూ...ఎక్కడ లేవన్నారు

రిజిస్టర్ కమిటీలో అందరికీ హక్కులు ఉంటాయని ఇది గమనించాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలోనే కొంత అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు

రిజిస్టర్ బాడీ ఎన్నికలు నిర్వహించాలంటే..రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలని, అటువంటిదేమీ చేయకపోవడం ఎన్నికల కమిటీకి అవగాహన రాహిత్యమేనని ఆయన దుయ్యబట్టారు

ఎన్నికల నిబంధనలను అడుగడుగున తుంగలో తొక్కారని, తమవారిని అందలం ఎక్కించేందుకే కుట్రలు జరిగాయని వెల్లడించారు. వ్యాపార వర్గాలు విజ్ఞతతో ఆలోచించాలని, ఇటువంటి కుయుక్తులను తిప్పి కొట్టాలని, అందరూ కలిసిమెలిసి ఉండాలని 'రావులపల్లి' ఆకాంక్షించారు



ఆగస్టు 2 నుంచి కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియలో అనేక అభ్యంతరాలు ఉన్నాయని, సుమారు 2 వేల మంది వ్యాపారుల సభ్యత్వాలకు సంబంధించిన నగదు మొత్తం బ్యాంకు ఖాతాలో జమ చేయలేదనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నిర్వహణ తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, కోర్టు ఇచ్చే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని బచ్చు శ్రీనివాస్ స్పష్టం చేశారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో

రాజకీయ జోక్యం అవసరమా?

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్



భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలపై ఇటీవల వెలువడిన రాజకీయ ప్రకటనల నేపథ్యంలో ఓ వర్గం నిరసన వ్యక్తం చేసింది. వ్యాపార సంఘాల నిర్ణయాలపై రాజకీయాల ప్రభావం ఏమిటంటే ప్రశ్నిస్తోంది

చాంబర్ ఎన్నికలు రాజకీయ నాయకుల అభిప్రాయాల ఆధారంగా కాకుండా సంస్థ నియమావళి, సభ్యుల నిర్ణయాలకు అనుగుణంగానే జరగాలని ఆ వర్గం స్పష్టం చేస్తుంది ఎన్నికల నిర్వహణ కోసం వ్యాపారస్తులంతా పరస్పర విశ్వాసంతో ఒక ఎన్నికల అధికారిని నియమించుకున్నారని ఎన్నికల అధికారి సంస్థ నియమావళికి అనుగుణంగా తీసుకునే నిర్ణయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందని పేర్కొన్నారుఎన్నికల ప్రక్రియలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వాటిని సంస్థ నిబంధనల ప్రకారం పరిష్కరించుకోవాలి. అంతేగానీ రాజకీయ జోక్యంతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని చూడటం సమంజసం కాదంటూ స్పష్టం చేశారు రిజిస్టర్డ్ సంస్థలో ప్రతి సభ్యుడికీ హక్కులు ఉంటాయి. అదే సమయంలో సంస్థ నియమావళిని గౌరవించాల్సిన బాధ్యత కూడా ఉంటుందని హక్కుల పేరుతో ఎన్నికల అధికారిపై ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదన్నారు

భద్రాచలం వ్యాపారస్తులకు తమ నాయకత్వాన్ని తామే ఎన్నుకునే పరిణతి, సామర్థ్యం ఉన్నాయి. బయటి వ్యక్తుల రాజకీయ సలహాలు, ఒత్తిళ్ల అవసరం లేదన్నారు

రామాంజనేయ కాలనీలో పోలీసుల మెరుపు తనిఖీలు..!

- **100 ఇళ్ల సోదా.. 11 వాహనాలు పోలీసుల అదుపులో**
- **45 వాహనాలకు జరిమానాలు.. అక్రమ మద్యం విక్రయాలపై 4 కేసులు నమోదు**

కొత్తగూడెం, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాంజనేయ కాలనీలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాలనీలోని సుమారు 100 ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు వాహనాల పత్రాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో 54 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన 45 వాహనాలపై జరిమానాలు విధించగా, 15 వాహనాలకు సంబంధించి జరిమానాలు వసూలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అదుపులో ఉంచారు. అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి 4 కేసులు నమోదు చేశారు.

అనంతరం కాలనీవాసులతో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ సమావేశమై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం గురించి వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మంత్రాలు, చేతబడి వంటి మూఢనమ్మకాలతో మోసపోవద్దని, ప్రజలు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని అవగాహన కల్పించారు.

రహదారి భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాలనీలోని ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు దోహదపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి, వెంకటేశ్వర్లు, యాసీన్, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.





కొత్తగూడెం సబ్ డివిజన్‌లో పోలీసుల మెరుపు తనిఖీలు.. లాడ్జిల్లోనూ నాకాబందీ!

- **ఏకకాలంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు.. అనుమానిత వ్యక్తులు, వాహనాల క్షుణ్ణ పరిశీలన**

కొత్తగూడెం, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం సాయంత్రం నుంచి పోలీసులు ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. నాకాబందీ తనిఖీలతో పాటు కొత్తగూడెం పట్టణంలోని పలు లాడ్జిలను పోలీసులు తనిఖీ చేశారు. లాడ్జిల్లో బస చేస్తున్న వారి వివరాలు, గుర్తింపు పత్రాలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. లాడ్జిల్లో బస చేసే ప్రతి ఒక్కరి వివరాలను తప్పని సరిగా నమోదు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు బస చేసినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జి యజమానులకు సూచించారు. పోలీసుల తనిఖీలకు సహకరించాలని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం, రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచడం ఈ ప్రత్యేక నాకాబందీ తనిఖీల ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. తనిఖీల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

సింగరేణిలో నూతన కార్మిక భద్రతా నిబంధనలపై అవగాహన.. ప్రమాద రహిత గనులే లక్ష్యం!

- **పని పరిస్థితుల కోడ్–2020, కేంద్ర నిబంధనలు–2026పై శిబిరం**
- **కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పెద్దపీట.. నిబంధనల అమలుపై అధికారుల దిశానిర్దేశం**

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

సురక్షిత సింగరేణి.. ప్రమాద రహిత సింగరేణి లక్ష్య సాధనలో భాగంగా కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కార్మిక భద్రత మరియు పని పరిస్థితుల కోడ్-2020, కేంద్ర నిబంధనలు-2026పై అవగాహన శిబిరాన్ని సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన గనుల భద్రతా సంచాలక కార్యాలయం, దక్షిణ మధ్య మండలం, హైదరాబాద్ ప్రాంతం-1 పర్యవేక్షణలో నవంబర్ 19న ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గనుల భద్రతా ఉప సంచాలకులు (డీఎంఎస్) ఐ. సత్యనారాయణ, గౌరవ అతిథిగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ పాల్గొన్నారు. కార్పొరేట్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) కృష్ణ గోపాల్ తివారీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఐ. సత్యనారాయణ మాట్లాడుతూ నూతన కార్మిక భద్రతా నిబంధనలు, వాటి అమలు విధానం, ఉద్యోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, గనుల్లో సురక్షిత పని వాతావరణం కల్పించడం వంటి కీలక అంశాలపై వివరించారు. నూతన కార్మిక చట్టాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలు, డిజిటల్ విధానంలో రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల బాధ్యతలు, భద్రతా ప్రమాణాల అమలుపై అవగాహన కల్పించారు.

గనుల్లో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలను సక్రమంగా వినియోగిస్తూ సురక్షిత పని విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. నూతన నిబంధనలపై ఉద్యోగులకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి, ఆరోగ్యకరమైన, సురక్షితమైన పని వాతావరణాన్ని నెలకొల్పవచ్చని పేర్కొన్నారు.సురక్షిత సింగరేణి - ప్రమాద రహిత సింగరేణి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్. వెంకటరమణ, ఏసీఎంఓ ఉషా, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లందు, మణుగూరు ఏరియాలతో పాటు కార్పొరేట్ కార్యాలయానికి చెందిన గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు, ఏరియా ఇంజనీర్లు, ఏరియా భద్రతా అధికారులు, గనుల మేనేజర్లు, పర్సనల్, ఐఈడీ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, మైన్ ఓవర్‌మెన్లు, మైనింగ్ సర్దార్లు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో 71వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

- **ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహణ.. పది ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొననున్నాయి**

హనుమకొండ ,నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):-

కమలాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో 71వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొననున్నాయి.

ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి వి .వి. రమణ, రాష్ట్ర చీఫ్ రిఫరీ రామకృష్ణ రెడ్డి పాల్గొని పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు పూర్తి స్పాన్సర్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తన తండ్రి ఈటల మల్లయ్య, తల్లి వెంకటమ్మల స్మారకార్థం సహకారం అందించడం పట్ల రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ క్రీడా కమిటీ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సభ్యులు సుదర్శన్, బీజేపీ నాయకులు బండి కళాధర్, మార్క అశోక్, పచ్చిమట్ల కుమారస్వామి, పిల్లి సతీష్, గంధసిరి శివ, బైరి రాజేష్, చేనుమల్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి

- **స్వయం సహాయక సంఘాలు ఐకమత్యంతో అభివృద్ధి చెందాలి..**
- **మహిళలకు అండగా ఉంటా : కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**

పాల్వంచ నవంబర్ 19(భద్రాద్రి న్యూస్):

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల ఆర్థిక అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచలోని విజయదుర్గ గ్రామ సమైక్య సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలు, వార్షిక బడ్జెట్ నివేదిక, పొదుపు వివరాలను కార్పొరేటర్‌కు వివరించారు.

సమావేశంలో విమలాదేవి మాట్లాడుతూ మహిళలు క్రమం తప్పకుండా పొదుపు చేస్తూ, సంఘాల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. సంఘ సభ్యుల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా ఐకమత్యంతో ముందుకు సాగుతూ, స్వయం సహాయక సంఘాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

శాలువాతో సన్మానించిన మహిళా సంఘాలు

ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఓ సరిత, ఆర్పీ నిమ్మల నాగమణి, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్భవించిందే

- **పిఆర్టియు యూనియన్..**
- **భరోసా మాది భవిష్యత్తు మీది..**
- **పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శేఖర్ రావు**

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 19(భద్రాద్రి న్యూస్):-

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి హక్కుల సాధన కోసం అనునిత్యం పోరాడే యూనియన్ పిఆర్టియు అని పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శేఖర్ రావు అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని పి ఆర్ టి యు యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి సమస్యకు పరిష్కారం మార్గంగా స్పందిస్తూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఉపాధ్యాయుల దరి చేర్చి వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే యూనియన్ పిఆర్టియు అని అన్నారు. ఉపాధ్యాయులకు అత్యంత కీలకంగా ఉన్న సంక్షేమ నిధి ఉపాధ్యాయుల కుటుంబాలకు అందజేస్తూ వారి భవిష్యత్తుకు భరోసానిస్తూ లక్షలాది రూపాయలను అందిస్తూ ఉపాధ్యాయులకు అండ దండగా నిలిచిన పిఆర్టియు యూనియన్ను ప్రతి ఒక్కరు సంఘ సభ్యులుగా చేరి బలోపేతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కార మార్గమే చూపెట్టడం కాకుండా ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందటానికి నిదర్శనంగా ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం పొందిన ఉపాధ్యాయులు సుందర్ వీరభద్రం కుటుంబాలకు ఒక్కో లక్ష చొప్పున రెండు లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రస్తుత ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుంకరి బిక్షం గౌడ్ జిల్లా అధ్యక్షులు పూనం నరసయ్య ప్రధాన కార్యదర్శి బి భాస్కరరావు గౌరవ అధ్యక్షులు ప్రభాకర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పూనం శ్రీనివాస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆర్ రంగారావు గౌరవ అధ్యక్షులు అసోసియేటెడ్ జిల్లా అధ్యక్షులు దశంబాబు రత్నకుమారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







పేదలు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ఇందిరమ్మ లక్ష్యం

- **ఇందిరాగాంధీ ఆశయాలే కాంగ్రెస్ శ్రేణులకు స్ఫూర్తి**
- **ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ.. ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు**

పాల్వంచ నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):-

పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత నేత, భారత మాజీ ప్రధాని, భారతరత్న దివంగత ఇందిరాగాంధీ అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కొనియాడారు.

ఇందిరాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాల్వంచ పట్టణంలోని శ్రీ శ్రీనివాస ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథిగా పాల్గొనగా, కొత్వాల శ్రీనివాసరావు నేతృత్వంలో ఇందిరాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, దేశంలో హరిత విప్లవానికి బాటలు వేయడంతో పాటు పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. దేశ తొలి మహిళా ప్రధానిగా ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుని దేశాభివృద్ధికి, సామాన్య ప్రజల సంక్షేమానికి అంకితమైన మహోన్నత నాయకురాలని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలు కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ రాహుల్ గాంధీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే వరకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు ముక్కంటేశ్వరరావు, సోమరాజు దొర, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, శ్రీ శ్రీనివాస ఆటో యూనియన్ నాయకులు చెన్నూరి రాము, అగ్నిమండలం భాస్కర్, మందా మురళి, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, జాలె జానకిరెడ్డి, కొండం వెంకన్నగౌడ్, మహిపతి రామలింగం, నూకల రంగారావు, భువన సుందర్ రెడ్డి, చింతా నాగరాజు, వై. వెంకటేశ్వర రావు, పైడిపల్లి మహేష్, వాసుమల్ల సుందర్ రావు, కాపర్తి వెంకటాచారి, కార్పొరేటర్లు కాల్వ భాస్కర్ రావు, దంతెబోయిన నరేష్, షేక్ బాషా, గద్దల రమేష్, కటుకూరి శేఖర్, దారా చిరంజీవి, ఉండేటి శాంతివర్ధన్, బూని శ్రీను, కె. లక్ష్మణ్, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, పెండ్యాల శ్రీనివాస్, గుండు రవి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వై. శ్రీనివాసరెడ్డి, పెద్దబాబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ అయ్యప్ప ఆలయంలో ఈ నెల 28న మండల పూజ మహోత్సవం

- **17 నుంచి డిసెంబర్ 4 వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు..**
- **కన్నెజ్యోతులతో నగర సంకీర్తన, నిప్పులపై నడక, అన్నప్రసాద వితరణ**

పాల్వంచ, నవంబర్ 19(భద్రాద్రి న్యూస్):

పాల్వంచ అయ్యప్ప నగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో ఈ నెల 28న మండల పూజ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, ట్రస్ట్ సభ్యుడు కొత్వాల శ్రీనివాసరావు వెల్లడించారు. నవంబర్ 17 నుంచి డిసెంబర్ 4 వరకు ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆలయ తంత్రి బ్రహ్మశ్రీ మాధవన్ నంబూతిరి, అర్చకులు బృందావనం నర్సింహా మూర్తి పర్యవేక్షణలో మండల పూజ మహోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే నవంబర్ 17న ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, భక్తులు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మహోత్సవ కార్యక్రమాల వివరాలు:

* నవంబర్ 22, ఆదివారం: తెల్లవారుజామున 4 గంటలకు అష్టద్రవ్య మహా గణపతి హోమం, అభిషేకం, ఉషపూజ నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి ఐదు హోమగుండాలతో విశేష రుద్ర హోమం జరగనుంది.
* నవంబర్ 24, మంగళవారం: కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో లక్ష దీపార్చన నిర్వహించనున్నారు.



* నవంబర్ 28, శనివారం - మండల పూజ మహోత్సవం: ఉదయం 4 గంటలకు గణపతి హోమం, అభిషేకం, ఉషపూజ, ఉదయం 8.30 గంటలకు శ్రీ భూతబలి (బలిపీఠ పూజ), ఉదయం 11.30 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు.

సాయంత్రం 4 గంటలకు బొల్లోరిగూడెం రామాలయం నుంచి మాలధారణ చేసిన కన్నెస్వాములు, దీక్షాపరుల ఆధ్వర్యంలో కన్నెజ్యోతులతో నగర సంకీర్తన ప్రారంభమవుతుంది. కేరళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య పాల్వంచ పట్టణ పురవీధుల మీదుగా స్వామివారి ఊరేగింపు ఆలయానికి చేరుకోనుంది.

రాత్రి 8.30 గంటలకు దీక్షాధారులచే నిప్పులపై నడక కార్యక్రమం, 9.30 గంటలకు స్వామివారి పుష్పాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

డిసెంబర్ 4: ఉదయం 9 గంటల నుంచి దంపతుల చే సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నగర సంకీర్తనలో పాల్గొనే మాలధారణ చేసిన స్వాములు ముందుగా కన్నెజ్యోతి రశీదు తీసుకోవాలని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులు విజయవంతం చేయాలని కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కాల్వ భాస్కర్, మేడిద సంతోష్ గౌడ్, కనగాల రాంబాబు, బి. శ్రీనివాస్, మిరియాల కమలాకర్, బండి లక్ష్మణ్, మేరెడ్డి వేమారెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు బి. వెంకట్, నరహరి, రమేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ.. ఈ నెల 21న కార్యక్రమం

- **ఖమ్మం టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో శిక్షణ..**
- **జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి వెల్లడి**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఈ నెల 21వ తేదీ శనివారం ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి తెలిపారు.

ఉపాధి కల్పన, శిక్షణ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ శిక్షణలో కోర్సు పరిచయం, వృత్తి లక్ష్యాల నిర్ధారణ, సమాచార మార్పిడి నైపుణ్యాలు, బృందపని, వ్యక్తుల మధ్య సంబంధాల నైపుణ్యాలు, సమయ నిర్వహణ, క్రమశిక్షణ, ఉద్యోగ దరఖాస్తు పత్రం తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, ఇంటర్నెట్ అవగాహన, ఆర్థిక అక్షరాస్యత, పరిశ్రమలపై అవగాహన, సమస్యల పరిష్కారం, వినియోగదారుల నిర్వహణ, పని నైతికత తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ ముగింపులో నైపుణ్యాల అంచనా, స్వీయ సమీక్ష, భవిష్యత్ ఉద్యోగ ప్రణాళికపై మార్గదర్శనం కల్పిస్తారని వివరించారు.

ఈ నెల 21న ఉదయం 11 గంటలకు ఖమ్మం జిల్లా టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,

పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలి

- **59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రముఖులకు సభ్యత్వాల అందజేత..**
- **గ్రంథాలయ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా పిలుపు**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):





పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా పిలుపునిచ్చారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ఘనంగా సన్మానించారు.

అదేవిధంగా మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర్ షేక్, నాగండ్ల మాధవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్రిక, చెల్లా ప్రతిభా రెడ్డి, వొయ్యూరి ఝాన్సీ తదితరులకు చైర్మన్ స్వయంగా గ్రంథాలయ సభ్యత్వాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో చాలామంది మొబైల్ ఫోన్ల వినియోగానికి అధిక సమయం కేటాయిస్తున్నారని, అదే సమయంలో పుస్తక పఠనానికి కూడా ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయ సభ్యత్వం పొందడం ద్వారా వివిధ రంగాలకు చెందిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు.

పుస్తకాలు చదవడం వల్ల ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన మెరుగుపడటమే కాకుండా జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. సభ్యత్వాలు పొందిన ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని క్రమం తప్పకుండా సందర్శించి పఠన అలవాటును కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపుల ప్రారంభం

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్***
- **ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో దశల వారీగా నెల రోజుల పాటు క్యాంపుల నిర్వహణ**
- **రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులు, బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాల నమోదు**
- **ఇతర ప్రభుత్వ బీమా పథకాలు ఉన్నా ఇందిరమ్మ కుటుంబ బీమాకు అర్హత**
- **క్యాంపుల నిర్వహణపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్- 19భద్రాద్రిన్యూస్



ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపులు నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో దశలవారీగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, నెల రోజుల లోగా అన్ని గ్రామాలు, వార్డుల్లో క్యాంపుల నిర్వహణ పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు.

జిల్లా స్థాయిలో, మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో శుక్రవారం నుంచి పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా క్యాంపులు నిర్వహించి కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

ప్రస్తుతం రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలు తమ రేషన్ కార్డును తీసుకుని సమీపంలోని క్యాంపునకు రావాలని సూచించారు. రేషన్ కార్డు నంబర్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని, కుటుంబంలో ఎవరి పేరు మీద బీమా చేయాలి, నామినీలు ఎంతమంది, వారికి చెల్లించాల్సిన భీమా వివరాలను శాతాల వారిగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

ప్రజలకు ఇప్పటికే రైతు బీమా, చేనేత బీమా, బీడీ కార్మికుల బీమా, భవన నిర్మాణ రంగ కార్మికుల బీమా మొదలగు ఇతర ప్రభుత్వ బీమా పథకాలు అమలులో ఉన్నప్పటికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించే ముందు నమోదు చేసిన వివరాలన్నింటినీ లబ్ధిదారులకు మరోసారి పూర్తిగా చదివి వినిపిస్తామని, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన మొబైల్ నంబర్‌కు దరఖాస్తు ఐడీ, సంబంధిత సమాచారం ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని పేర్కొన్నారు.

క్యాంపుల్లో భౌతికంగా దరఖాస్తులు సమర్పించడం, రసీదులు జారీ చేయడం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యాంపు కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో రేషన్ కార్డు వివరాలు, ట్రాన్సాక్షన్ ఐడీ, బీమా పొందే వ్యక్తి పేరు, నామినీ పేరు నమోదు చేసి సంబంధిత దరఖాస్తుదారుడి సంతకం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రస్తుతం రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలను ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించలేదని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాల నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశం అందుబాటులోకి వచ్చిన వెంటనే వారి దరఖాస్తులను కూడా స్వీకరించి, అట్టి దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ రేషన్ కార్డులతో సమీపంలోని క్యాంపులకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో సందడి.. మ్యూజికల్ చైర్స్ పోటీలు

- **ఉత్సాహంగా పాల్గొన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు**
- **వినోద కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందుతాయి: చైర్మన్ ఖాదర్ బాబా**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్స్ పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ, చదువుతో పాటు ఆటలు, వినోద కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలుగుతాయని అన్నారు. ఇలాంటి పోటీలు వ్యక్తుల్లో స్నేహభావం, ఐక్యత, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు అందరినీ ఉత్సాహంగా ఉంచుతాయని పేర్కొన్నారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర్ షేక్, నాగండ్ల మాధవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్రిక, చెల్లా ప్రతిభా రెడ్డి, వొయ్యూరి ఝాన్సీ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్ 1 లైబ్రేరియన్ సి. హెచ్. మాలసూరి, గ్రేడ్ 3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





ఏఎస్సైలుగా సేవలందించిన ఇద్దరు మహిళా అధికారులు ఎస్సైలుగా పదోన్నతి

- **పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందించిన ఖమ్మం సీపీ సునీల్ దత్**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తూ నిరంతర సేవలందించిన ఇద్దరు మహిళా పోలీస్ అధికారులకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా గురువారం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వారికి పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో ఏఎస్సైలుగా విధులు నిర్వర్తించిన ఎస్‌డీ. సలీమా బేగం, టి. నాగరాజా కుమారి ఎస్సైలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వారిని అభినందిస్తూ, పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగండ్ల శ్రీనివాసరావుకు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళి

- **పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సుడా చైర్మన్**
- **కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**

ఖమ్మం, నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగండ్ల శ్రీనివాసరావు మృతికి ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. నాగండ్ల శ్రీనివాసరావు మృతి విషయం తెలుసుకున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ నివాసానికి వెళ్లి శ్రీనివాసరావు పార్థివదేహాన్ని సందర్శించారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, పార్టీ నాయకులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



చింతనిపు సత్యనారాయణకు మాజీ ఎంపీ నామ ఘన నివాళి

- **అంత్యక్రియల్లో పాడె మోస్తూ కన్నీటి వీడ్కోలు**

ఖమ్మం ప్రతినిధి, నవంబరు 19(భద్రాద్రిన్యూస్):-

పెనుబల్లి మండలం కారాయిగూడెం సొసైటీ చైర్మన్ చింతనిపు సత్యనారాయణ అకాల మరణ వార్త తెలిసిన వెంటనే ఖమ్మం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు తన కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటిన కారాయిగూడెం చేరుకున్నారు. సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోస్తూ కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణతో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని నామ గుర్తు చేసుకున్నారు. సర్పంచ్‌గా, శ్రీ నీలాద్రీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా, సహకార సంఘం చైర్మన్‌గా ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సత్యనారాయణ మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కనగాల వెంకటరావు, లగడపాటి. శ్రీనివాసరావు, చెక్కిలాల మోహన్ రావు, చెక్కిలాల లక్ష్మణరావు, నరుకుళ్ళ.సత్యనారాయణ, పసుమర్తి వెంకటేశ్వరరావు చీకటి మోహన్ రావు, మోరంపూడి ప్రసాద్ రావు, మందడపు అశోక్ కుమార్, చింతనిప్పు శ్రీనివాసరావు, గోదా చెన్నారావు, గువ్వల వెంకట రెడ్డి, దొడ్డపనేని రవి, బెల్లంకొండ చలపతిరావు, రేగుముడి అప్పయ్య, కోమటి ప్రసాద్, మోరంపూడి బాబురావు, వాకదాని కోటేశ్వరరావు, చింతనిప్పు కృష్ణ చైతన్య, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని సత్యనారాయణకు ఘన నివాళులర్పించారు.





గంజాయి అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం..

- **రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి**
- **ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ సునీల్ దత్**
- **సిబ్బంది విధులు, స్టేషన్ రికార్డులు పరిశీలించి కీలక ఆదేశాలు**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్)0



: గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. గురువారం ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన ఆయన, స్టేషన్ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు.

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే సంబంధిత నేరస్థులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని మరింత ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, నిర్మానుష్య ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు.

రాత్రి సమయాల్లో వ్యాపార సముదాయాలు, దుకాణాలు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా మూసివేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ సూచించారు. ముఖ్యంగా సెక్టర్ ఆఫీసర్ల విధులు, బాధ్యతలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ, తమ పరిధిలోని ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యాత్మక అంశాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యలను గుర్తించి పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు.

యాదవుల ఐక్యతకు కార్తీక వన సమారాధన వేదిక కావాలి!

- **రాజకీయాలు, వర్గాలకు అతీతంగా యాదవులంతా కలిసిరావాలి**
- **కార్తీక వన సమారాధన సన్నాహక సమావేశంలో యాదవ మహాసభ నాయకుల పిలుపు**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 19 (భద్రాద్రి న్యూస్):



యాదవుల ఐక్యత, అభివృద్ధి, ఆత్మగౌరవానికి ప్రతీకగా కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా యాదవులందరూ ఐక్యంగా పాల్గొనాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పిలుపునిచ్చారు.

ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీక వన సమారాధన కార్యక్రమానికి సంబంధించి మంగళవారం ఖమ్మంలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న యాదవ్, ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు దుబాకుల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి చంద్రకాని రమణ యాదవ్, జిల్లా ఓబీసీ నాయకులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వందేళ్లకు పైగా ఘన చరిత్ర కలిగిన అఖిల భారత యాదవ మహాసభ, యాదవుల ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. మహాసభ జెండా కింద ఐక్యంగా ముందుకు సాగడం ద్వారా సామాజికంగా, రాజకీయంగా మరింత బలపడే అవకాశం ఉందన్నారు. ఉత్తర భారతదేశంలో యాదవులు ఇతర సామాజిక వర్గాలతో కలిసి ఐక్యతను చాటుతూ జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతున్నారని వివరించారు.

ఖమ్మం జిల్లాలో కూడా యాదవులంతా ఒకే వేదికపైకి వచ్చి కార్తీక వన సమారాధనను ఐక్యతా కార్యక్రమంగా నిర్వహిస్తే సమాజానికి మంచి గౌరవం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను, యాదవ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎవరికీ ఎలాంటి భేషజాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పాల్గొని ఐక్యతను ఉద్యమ స్ఫూర్తితో చాటాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా నాయకులు లిక్కి కృష్ణారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దుబాకుల వెంకటేశ్వర్లు, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య, మల్లెపోయిన శ్రీనివాస్, మారుతీ ఎట్టయ్య, జోనబోయిన పాపయ్య, కనకబండి విజయలక్ష్మి, ఉమా యాదవ్, పొదిల భూపతి, బొల్లి కొమరయ్య, కన్నెబోయిన రవి, బండారు ప్రభాకర్, మల్లేశం, తోడేటి లింగరాజు, నరసింహారావు, కోటయ్య, మురళి, నడికొప్పుల గోపరాజు, తుప్పాతి రవి, మెండే వెంకటేష్, బరిగెల రామ్మూర్తి, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 24 నుంచి తెలంగాణ ఇంటర్ పరీక్షలు!

- **ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షల నిర్వహణ**
- **ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్స్.. 11 నుంచి ఫస్టియర్ ప్రాక్టికల్స్**

హైదరాబాద్, నవంబర్ 19(భద్రాద్రి న్యూస్):-



తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల తేదీలు, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ వివరాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రిన్సిపల్ సెక్రెటరీ అఖిలాష అభినవ్ (ఐఏఎస్) వెల్లడించినట్లు సమాచారం.

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్

ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్స్: ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. ఆదివారాల్లో కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఇంటర్ ఫస్టియర్ ప్రాక్టికల్స్: ఫిబ్రవరి 11 నుంచి 18వ తేదీ వరకు మూడు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు వెల్లడించారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌లతో ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 19(భద్రాద్రి న్యూస్):-



హెల్త్ పాలసీలతో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సంపూర్ణ రక్షణ అందిస్తున్నాయని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ మేనేజర్ గద్దగూటి రేవతి తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఆరోగ్య పరిరక్షణకు వజ్రాయుధంలా దోహదపడుతున్నాయని తెలిపారు. కరోనా తర్వాత సమాజంలో హెల్త్ పాలసీలపై అనూహ్యంగా ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నారు. ముందస్తుగా హెల్త్ పాలసీలో చేరిన వారికి అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అన్ని ఎన్ పానెల్ ఆస్పత్రులలో ఉచితంగా ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యం చేయించుకునే సువర్ణ అవకాశం లభిస్తుందని తెలియజేశారు. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా హెల్త్ ఇన్సూరెన్సులు చేయించుకున్న వారికి తమతో పాటు కుటుంబ సభ్యులందరికీ ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటున్నాయి అన్నారు. భర్త, భార్య, ఇద్దరు పిల్లలకు కలిపి ముందుస్తుగా వారి వయసును బట్టి హెల్త్ పాలసీ సంవత్సరానికి 15వేల రూపాయల నుంచి 50వేల రూపాయల వరకు హెల్త్ పాలసీలు అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. ఈ హెల్త్ పాలసీల ద్వారా అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఉచితంగా అందుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. సాధారణ అనారోగ్యంతో పాటు గుండె ఆపరేషన్లు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు, ఐవిఎఫ్ వైద్యం, ఆర్థోపెడిక్ వైద్యం తదితర ఆత్యాధునిక వైద్య సౌకర్యాలను హెల్త్ పాలసీలతో అందుబాటులో ఉన్నాయని రేవతి తెలియజేశారు.తమ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండే హెల్త్ పాలసీలన ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రేవతి కోరారు. హెల్త్ పాలసీలకు సంబంధించిన ఏవైనా అనుమానాలు ఉంటే అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి 9959925756 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ మేనేజర్ గద్దగూటి రేవతి కోరారు.